క్లుప్తంగా

కోడి పందేలపై ప్రత్యేక నిఘా

సీఐ ఆవుల భాస్కర్



గురజాల : సంక్రాంతి పండగ పురస్కరించుకుని గ్రామాల్లో పేకాట, కోడి పందేలు జరుగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పశువుల సంత, బ్రహ్మనాయుడు విగ్రహం సెంటర్‌లలో ఆదివారం డ్రోన్‌లతో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురజాల డీఎస్పీ జగదీష్ సారథ్యంలో డ్రోన్‌లతో ప్రత్యేకంగా నిఘా చేస్తున్నామన్నారు. ఎవరైనా కోడి పందేలు, పేకాట స్థావరాలు ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. మొత్తం 5 డ్రోన్ కెమెరాలతో నిఘా పటిష్టం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ గోకులాలు పాడి రైతులకు ఓ వరం

ఏపీఓ జయచంద్రకుమార్



రెంటచింతల: ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేస్తున్న మినీ గోకులాలు పాడి రైతులకు ఓ వరమని ఏపీఓ జయచంద్రకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని రెంటచింతల, రెంటాల గ్రామాలలో నిర్వహించిన పల్లె పండగ వారోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక్కొక్క మినీ గోకులం నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30 లక్షలు రాయితీ ఇస్తుందన్నారు. మండలానికి మొత్తం 25 మినీ గోకులాలు మంజూరు కాగా ఒక్క రెంటచింతల గ్రామానికే 11 మినీ గోకులాలు కేటాయించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు పూర్తిగా షెడ్ నిర్మాణం చేపట్టిన వారికే రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, కార్యదర్శి కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు తుమ్మా మర్రెడ్డి, మూలి రాజారెడ్డి, బీఎఫ్‌టీ ఏసీహెచ్ కోటేశ్వరరావు, ఎఫ్ఏ ఎం.ఏడుకొండలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే శిక్ష తప్పదు

పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు



పిడుగురాళ్ల: సంక్రాంతి పండగను పురస్కరించుకొని పట్టణ, గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించినా, గుండాటలు ఆడినా, జూదాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని పట్టన సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేసన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగను ప్రతి ఒక్కరు సంతోషంతో జరుపుకోవాలని సూచించారు. జూదాలకు పాల్పడేందుకు చూస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణం, గ్రామాల్లో ఎవరైనా, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, జూదాలు నిర్వహించినా నేరుగా తమకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచటం జరుగుతుందని పేర్కొన్నారు. వారికి తగిన పారితోషికం అందించటం జరుగుతుందన్నారు. ఇప్పటికే పట్టణం, మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక వాహనం ద్వారా ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ప్రచారం నిర్వహించటం జరిగిందన్నారు. పండగ సందర్భంగా ఎవరైనా ఇంటికి తాళం వేసి వేరే ఊళ్లకు వెళితే పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే గృహాలకు పోలీసులు రక్షణగా ఉంటారని సూచించారు. ఇటువంటి అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలకు సహకరించాలని సూచించారు. 9440796226 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఫేస్ వాష్



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ పోలీసులు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సూదూర ప్రాంతాల నుంచి వస్తున్న లారీలు, భారీ వాహనాలను పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నిలిపి, డ్రైవర్లు ముఖం కడుక్కొని బయలు దేరేలా చూశారు. పట్టణ ఎస్ఐ ఎం సంధ్యారాణి మాట్లాడుతూ కంటి మీద కునుకు లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిలబడి ప్రయాణించాల్సిందేనా..?!

- ఆదాయం ఉన్నా.. పట్టించుకోని అధికారులు
- రెంటచింతల రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కరువు
- కనీస సౌకర్యాలు లేక అల్లాడుతున్న ప్రయాణికులు
- రైల్వే ప్లాట్‌ఫాంపై అల్లుకున్న ముళ్లపొదలు
- చాలని బోగీలు.. ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



రెంటచింతలలోని రైల్వేస్టేషన్



ప్లాట్‌ఫాంపై అల్లుకుపోయిన ముళ్లపొదలు

రెంటచింతల: బ్రిటీష్ వారి కాలంలో మండల కేంద్రమైన రెంటచింతలలో ఏర్పాటు చేసిన రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. రైల్వేస్టేషన్‌కు ఆదాయం పుష్కలంగా వస్తున్నప్పటికీ అధికారులు ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. 1990-91 వరకు రైల్వే ఉద్యోగులే ఇక్కడ ఉండి ప్రయాణికులకు టికెట్లను విక్రయించేవారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ వ్యక్తులకు టికెట్లను విక్రయించుకునేందుకు అనుమతినిచ్చారు.

+ రైల్వేస్టేషన్ పరిసరాలలోనే కాకుండా ప్లాట్‌ఫాంపైకి ముళ్లపొదలు ఉండంటతో విషసర్పాలకు నిలయంగా మారిపోయిందని.. రైలు ఎక్కడానికి కూడా ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు లేని రోజులలో ఈ రైల్వేస్టేషన్ నుంచి మీటర్‌గేజ్ రైల్ ద్వారా నాపరాయిని పలు ప్రాంతాలకు తరలించేవారు.

చార్జి తక్కువ కావడంతో...

రోజురోజుకు బస్‌చార్జీలు విపరీతంగా పెరుగుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలకు రైల్వే చార్జీలు అందుబాటులో ఉండటంతో ఎక్కువ మంది రైలు ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు.

+ రెంటచింతల నుంచి ప్రతి రోజు 6 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి రోజు మాచర్ల-విజయవాడ, గుంటూరు-మాచర్ల, మాచర్ల-నడికుడి, మాచర్ల-రేపల్లె ప్యాసింజర్ రైళ్లు ఈ మార్గంలో వెళ్తున్నాయి. మాచర్ల నుంచి గుంటూరు వెళ్లే రైలులో రెంటచింతల 2వ స్టాపు అయినా కూడా ప్రయాణికులు గుంటూరు వరకు నిలబడి ప్రయాణించాల్సిందే. ఉన్న బోగీలు సరిపోవడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు.

+ ప్రతి రోజు మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాది మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆదాయం అధికంగా వస్తున్నప్పటికీ స్టేషన్‌లో కనీస వసతులు కల్పించి అభివృద్ధి చేయడం పట్ల అధికారులు చిన్న చూపు చూస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.

+ గతంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణుగోపాలరెడ్డి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు మంజూరు చేయించిన రూ.50 లక్షల నిధులతో అరకొర పనులు చేసి మమ అనిపించారు.

+ స్టేషన్‌లో ప్రయాణికులకు కుర్చోవడానికి బల్లలు సైతం ఏర్పాటు చేయకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు రైల్ వచ్చే వరకు నిలబడాల్సి వస్తుందని, మరుగుదొడ్లు లేకపోవడం వలన అత్యవసర పరిస్థితులలో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. రైల్వేస్టేషన్‌లో సరైన విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస వసతుల లేక ఇబ్బందులు



రైల్వేస్టేషన్‌కు కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజు వందలాదిమంది వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వస్తున్న ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులదే. కనీసం స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై నున్న ముళ్లపొదలు తొలిగింపు చర్యలు తక్షణమే చేపట్టాలి.

– వైఎంఆర్ ప్రతాప్‌రెడ్డి, రెంటచింతల

అదనపు బోగీలు ఏర్పాటు చేయాలి



మాచర్ల నుంచి గుంటూరుకు ఉదయం వెళ్లే ప్యాసింజర్‌కు 7, 8 బోగీలు ఏర్పాటు చేయడం వలన రెండో స్టేజీ రెంటచింతలలోనే కూర్చోవడానికి సీట్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రెంటచింతల నుంచి గుంటూరుకు రైలుకు రూ.30 కాగా, బస్సుకు రూ.155 చార్జి అవుతుంది. అదనపు బోగీలు ఏర్పాటు చేసేందుకు అధికారులు వెంటనే చొరవ చూపడం వలన పేద ప్రజలకు మేలు జరుగుతుంది.

– సీహెచ్ నీలావతి, రెంటచింతల

రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



రెంటచింతల రైల్వేస్టేషన్‌కు మంచి ఆదాయం వస్తున్నా అధికారులు చిన్నచూపు చూడటం విచారకరం. రెంటచింతల రైల్వేస్టేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుకు నరసరావుపేట ఎంపీ కృషి చేయాలి. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, కూర్చోవడానికి బల్లలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.

– నారాయణపురం శ్రీనివాస్, రెంటచింతల

యువత జూదాల జోలికి వెళ్లవద్దు

డీఎస్పీ జగదీష్



గురజాల : సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువత పేకాట, గుండాట, కోడి పందేలు, బెట్టింగులు వంటి క్రీడల జోలికి వెళ్లవద్దని గురజాల డీఎస్పీ జగదీష్ సూచించారు. ఆయన తన కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ క్రీడల ముద్దు అన్నారు. పండుగను యువత సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని చెప్పారు. ప్రతి ఒక్కరూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్ఐ సీహెచ్ నాగార్జున



రెంటచింతల: మండలంలోని గ్రామాలలో సంక్రాంతిని పురస్కరించుకుని ఎవరైనా చట్ట వ్యతిరేకంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీహెచ్ నాగార్జున హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ నాగార్జున మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాలలో కోడి పందేలు, లాటరీలు, కోతముక్క ఇతర చట్ట విరుద్ధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. కోడి పందేలు నిర్వహించిన, చూసిన నేరమని, పందేలు నిర్వహించిన స్థలం వారిపై కూడా చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నివారించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, సంక్రాంతి సందర్భంగా ఇతర గ్రామాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు



దుర్గి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 71వ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవానికి మండల కేంద్రమైన దుర్గిలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో డ్యాన్సు బేబి డ్యాన్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం భోగి పండగ రోజు స్వామి వారికి మంగళవాయిద్యాలతో సుప్రభాత సేవ, అభిషేక కార్యక్రమాలు, కల్యాణం నిర్వహించనున్నారు. సాయంత్రం ముగ్గుల పోటీల ఏర్పాట్లు చేశారు. మంగళవారం స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలతో పాటు రథోత్సవం గ్రామస్తులు ఘనంగా నిర్వహించనున్నారు. రాత్రి కోలాటాలు, సినీ మ్యూజికల్ నైట్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గయోపాఖ్యానం, దేవనర్తకి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 15న సాయంత్రం స్వామి వారికి వసంత సేవ నిర్వహిస్తున్నట్లు పూజారులు తెలిపారు. 20 నుంచి 23 వరకు ఎడ్ల బల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు స్వామి వారి భక్త బృందం తెలిపింది.

గ్రామ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలి

సీఐ శ్రీరాం వెంకట్రావు



రాయల్ కింగ్స్‌కు బహుమతి అందజేస్తున్న సీఐ శ్రీరాం వెంకట్రావు, కొమ్మా మహేష్

పిడుగురాళ్ల: గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మండల స్థాయిలో ఆటల పోటీలను నిర్వహించాలని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని కన్నెగంటి భార్గవనాయుడు జ్ఞాపకార్థం క్రేజీ బాయ్స్ ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిడుగురాళ్ల పట్టణ సీఐ పాల్గొని మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలో ఎంతో మంది క్రీడాకారులు ఉన్నారని, వారి ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొదటి బహుమతి రాయల్ కింగ్స్ సాధించగా రూ.22,222 నగదు, షీల్డ్, రెండవ బహుమతి టీమ్ పల్నాడు సాధించగా రూ.17,777 నగదు, షీల్డ్, మూడవ బహుమతి జానపాడు జాని సీసీ రూ.12,2222 నగదు, షీల్డ్‌ను సీఐ శ్రీరాం వెంకట్రావు, కొమ్మా మహేష్, కన్నెగంటి భార్గవనాయుడు కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కొమ్మా మహేష్, సన్ని, జాని, సద్దాం, మహేష్, బాబు, దేవిచంద్, రత్నం, నాయక్ ఉన్నారు.

శ్మశాన వాటికలో నిర్మాణాలను వెంటనే ఆపాలి



శ్మశాన వాటికలో ధర్నా నిర్వహిస్తున్న మాలలు

పిడుగురాళ్ల: పట్టణంలోని మాలల శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకొని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించటం సరికాదని మాల మహానాడు నాయకులు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ చెరువు వెనుక వైపు, రిక్షా కాలనీ సమీపంలో ఉన్న మాలల శ్మశాన వాటికలో అనుమతులు లేకుండా, తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఈ మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మించటంతో తమ శ్మశాన స్థలం తగ్గిపోయి భవిష్యత్‌లో ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. 3 వేల గడపలు ఉన్న మాలలకు 150 సంవత్సరాల క్రితమే 5.50 ఎకరాల స్థలం అప్పటి రెవెన్యూ అధికారులు కేటాయించి అందించారన్నారు. దానిని ఇప్పుడు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని పేర్కొన్నారు. ఇప్పుడు ఎటువంటి సమాచారం లేకుండా తమ శ్మశాన స్థలంలో మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మించటంతో సగానికి పైగా ఆక్రమించి ఉందని, తక్షణమే ఈ నిర్మాణాలు ఆపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శ్మశాన వాటికలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా మాల మహానాడు నాయకులు దొప్పలపూడి శౌరి, పాశం శ్యామ్, గారపాటి సంగీతరావు, పణితి రత్నకుమార్, కొమ్మా మోషే, యర్రం శామేలు, జడ సురేంద్ర, పాశం బనహర్, మార్టిన్ పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పల్లె బాట పట్టిన పట్టణాలు



బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం వీరాస్వామి

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ

మాచర్ల రూరల్: తెలుగువారి అతిపెద్ద పండగ, కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని సుదూర ప్రాంతాల నగరాలలోని ప్రజలు పట్టణాలు, పల్లెలకు వస్తున్నారు. సొంత వాహనాలు, ఇతర వాహనాలలో పల్లెలకు చేరుకుంటున్న వారితో సందడి వాతావరణం నెలకొంది. ప్రయణికులతో బస్టాండ్‌లు కిటకిటలాడుతున్నాయి. వారి సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసింది. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, చార్జీలు పెంచకుండా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం వీరాస్వామి తెలిపారు. పల్లెలు, పట్టణాలకు 32 బస్సులను నడుపుతున్నట్లు వీరాస్వామి చెప్పారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మాచర్ల చుట్టుపక్కల ప్రాంతాలకు వచ్చే వారిని సురక్షితంగా గమ్యాలకు చేర్చేందుకు హైదరాబాద్‌లోని జూబ్లీ బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సూపర్‌వైజర్లతో పర్యవేక్షణ జరుపుతున్నామన్నారు. ఇక్కడ నుంచి బస్సులను పంపేందుకు అసిస్టెంట్ మేనేజర్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. సంక్రాంతి తరువాత తిరిగి వెళ్లే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని 16, 17 తేదీల్లో ఇక్కడ నుంచి హైదరాబాద్‌కు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు



గురజాల రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో ఆదివారం డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు అందించిన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రాణవాయువును అందించే మొక్కలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వై.వినోద్ కుమార్‌లు పాల్గొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పలుచూరి నాగేశ్వరరావు, బిక్కి పూర్ణ, వేముల రామకృష్ణ, వెల్ఫేర్ ఆర్గనైజర్ బిక్కి అలేఖ్య వరప్రసాద్ తదితరులున్నారు.

లోక కల్యాణ పూజలు

అనంతవరం(క్రోసూరు): అనంతవరం గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సంక్రాంతి పండగ పురస్కరించుకుని లోక కల్యాణ పూజలు ఆదివారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు పోతురాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొన్నారు.

నందిగామలో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కంచేటి శేషగిరిరావు (75) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. హుటాహుటిన వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు కంచేటి నాగరాజు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మీయ సమావేశం



మాచర్ల రూరల్ : కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగ కార్మిక సంఘాలతో ఆదివారం మాచర్ల పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎలక్షన్‌లో ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, సీఐటీయూ పల్నాడు ఇన్‌చార్జి ఆంజనేయులు నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, మాచర్ల ప్రాంతీయ సీఐటీయూ కార్యదర్శి బండ్ల మహేష్, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కార్యదర్శి పి.ప్రేమ్ కుమార్, జేవీకేఎస్ ప్రసాద్, ఉష, సుల్తానా, ఎస్.శాంతిబాయి, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

వివేకానందుని జీవితం యువతకు ఆదర్శం



తుమ్మకోటలో వివేకనందుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ సేవా సమితి సభ్యులు



వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తుమ్మకోట(రెంటచింతల): నరేంద్రునిగా మొగ్గ తొడిగి భారతీయ ఆత్మగా తన ప్రబోధ సుగంధాన్ని విశ్వం నలువైపులా వెదజల్లిన మహనీయుడు వివేకానందుని జీవితం నేటి యువతకు ఆదర్శమని మాచర్ల రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం వివేకనందుని జయంతిని పురస్కరించుకుని ఆయన తుమ్మకోట సేవా సమితి సభ్యులతో కలిసి వివేకనందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బానిసత్వ సంకెళ్లను తెంచుకునే విధంగా స్వదేశీయులను మేలుకొలుపుతూనే ఆదర్శ సమాజ నిర్మాణం కోసం ఆధ్యాత్మిక విలువలను ప్రతిష్టిస్తూ జీవితాన్ని మాతృదేశ సేవకే అంకితం చేసిన మహాపురుషుడు వివేకానందుడని కొనియాడారు. దేశ విదేశాలల్లో నున్న భారతీయ యువతను తన ప్రసంగాలతో, రచనలతో ఉత్తేజపరిచి వారిలో స్ఫూర్తిని రగిలింపచేసి దేశ స్వాతంత్ర్య ఉద్యమం వైపు నడిచేలా దశ దిశ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, సాయిబాబా, వ్యవస్థాపక అధ్యక్షుడు రామయ్య, అధ్యక్షుడు నాగేశ్వరరావు, సభ్యులు అంకారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతకు మార్గదర్శకుడు స్వామి వివేకానంద

పిడుగురాళ్ల: యువతకు స్వామి వివేకానంద మార్గదర్శకులుగా ఉంటారని కేఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్లు కె.నరసింహారావు, బాడిస మస్తాన్‌రావులు అన్నారు. పట్టణంలోని కేఎస్ఆర్ విద్యా సంస్థల్లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం ఉంటే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని, ఏ కార్యమైనా సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి.నరసింహారావు, సోమశేఖర్, గోపికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పండగలు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తాయి



బహుమతులు అందిస్తున్న చైర్మన్ తదితరులు



ముగ్గులను పరిశీలిస్తున్న చైర్మన్

మునిసిపల్ చైర్మన్ పోలూరి శ్రీనివాసరావు

మాచర్ల రూరల్ : పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తాయని మాచర్ల మునిసిపల్ చైర్మన్ పోలూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మాచర్ల పట్టణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో మెగా ముగ్గుల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి మన సంప్రదాయాలు, పండగలు గుర్తు ఉండేలా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సంక్రాంతి అంటేనే ముగ్గుల పండగని, ప్రతి ఏటా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న వాసవి క్లబ్ చెన్నకేశవ నిర్వాహకులను అభినందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మున్సిపల్ కౌన్సిలర్ గట్ల అరుణకుమారి, ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ లక్ష్మీప్రసన్న, ఊటుకూరి నీరజలు వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి, కన్సలేషన్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు భవనాసి రవితేజ, కార్యదర్శి బత్తుల వీరబ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజ్‌కుమార్, జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవ రావు, పాస్ట్ సెక్రటరీ పందిరి నరసింహారావు, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధుల వెంకట నాగేశ్వరరావు, సభ్యులు చుండూరు సత్యనారాయణ, లక్ష్మీచెన్నకేశవ దేవస్థాన ఎగ్జిక్యూటివ్ అధికారి సాంబయ్య, గట్ల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.